
అధికార పార్టీ మరో అక్రమానికి తెరలేపింది. ఎమ్మెల్యే నాని అనుచరుల కనుసన్నల్లో అక్రమ పట్టాలు గుట్టుచప్పుడు కాకుండా పంపిణీకి రంగం సిద్ధమైంది. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వేదికగా నందివాడకు చెందిన రెవెన్యూ ఉద్యోగిని అనధికార డిప్యుటేషన్‌పై తీసుకువచ్చి పట్టాలను సిద్ధం చేస్తున్నట్టు అధికార పార్టీ నాయకులే బహిరంగంగా చెబుతుండటం గమనార్హం. పట్టాలపై పాత తేదీలు వేసి పాత అధికారులతో సంతకాలు పెట్టించి ఎన్నికల షెడ్యూల్ వచ్చేలోపు పంపిణీ చేసేందుకు రెవెన్యూ అధికారులు, ఎమ్మెల్యే అనుచరులు రెండు నెలలుగా కసరత్తు చేస్తున్నారు. గన్నవరంలో ఎమ్మెల్యే వంశీ అక్రమ పట్టాలు పంపిణీ చేసినట్టే గుడివాడ ఎమ్మెల్యే అదే పంథాలో అక్రమ తంతుకు సిద్ధమయ్యారు.



ఓట్లు పట్టాలని..

గుట్టుచప్పుడు కాకుండా అక్రమ పట్టాలు సిద్ధం చేసిన కొడాలి నాని

- వైసీపీ కార్యకర్తలు, సానుభూతిపరులతో జాబితా సిద్ధం
- చక్రం తిప్పుతున్న రెవెన్యూ అధికారి
- పాత తేదీలతో పట్టాల పంపిణీకి ఏర్పాట్లు
- ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సర్వం సిద్ధం
- ఒక్కో పట్టాకు రూ.50వేల నుంచి రూ.లక్ష వసూలు
- లబ్ధిదారుల పేర్లు బయటకు పొక్కనీయకుండా చర్యలు



ఎమ్మెల్యే కొడాలి నాని క్యాంప్ కార్యాలయం (ఫైల్)

గుడివాడ : ముఖ్యమంత్రి జగన్ గతేడాది జూన్ 6వ తేదీన గుడివాడ పర్యటనలో మరో 3వేల మంది లబ్ధిదారులకు సెంటు స్థలం పట్టాలు ఇస్తానని హామీ ఇచ్చారు. ఇప్పటి వరకూ పట్టించుకోలేదు. గుడివాడను అభివృద్ధి చేయలేదు. ఇచ్చిన హామీలు అమలు చేయలేదు. దీంతో పార్టీ కార్యకర్తల్లోనూ వ్యతిరేకత నెలకొంది. ఎన్నికల్లో లబ్ధి పొందాలంటే ఏదో ఒకటి చేయాలని, కనీసం పార్టీ కార్యకర్తలనైనా నిలబెట్టుకోవాలని స్థానిక ఎమ్మెల్యే భావించారు. రెవెన్యూ అధికారిని పిలిపించి త్వరితగతిన పట్టాలు సిద్ధం చేయాలని, వైసీపీ కార్యకర్తలు, సానుభూతిపరులకు ఇవ్వాలని కోరారు. అధికార పార్టీకి వీరవిధేయులుగా ఉన్న సదరు అధికారి వెంటనే వీఆర్వోలకు పట్టాలు సిద్ధం చేయాలని దిశానిర్దేశం చేశారు. కొందరు వీఆర్వోలు తాము చేయబోమని తేల్చి చెప్పారు. ఎన్నికల అనంతరం సంతకాలు చేయని అధికారులపై తమ పద్ధతిలో చర్యలు తీసుకుంటామని గడ్డం గ్యాంగ్‌తో పాటు రెవెన్యూ అధికారి సైతం బెదిరింపులకు దిగడంతో కొందరు అధికారులు సంతకాలను చేయడానికి ముందుకొచ్చారు.

నెల రోజులుగా జాబితాపై కసరత్తు

ముగ్గురు వైసీపీ నాయకులు, ఇద్దరు రెవెన్యూ అధికారులు కలిసి లబ్ధిదారుల జాబితాపై నెల రోజులుగా కసరత్తు చేస్తున్నారు. అందులో వైసీపీ కార్యకర్తలు, సానుభూతిపరులు ఉండేలా చూసుకుంటున్నారు. పట్టణంతో పాటు మున్సిపాలిటీలో విలీనం కానున్న గ్రామాల నుంచి లబ్ధిదారులను ఎంపిక చేసినట్టు సమాచారం. అంతా సిద్ధం చేసి పాత తేదీలతో పట్టాలు ఇచ్చేందుకు పూనుకున్నారు. బదిలీపై వెళ్లిన అధికారులందరినీ హుటాహుటిన గుడివాడ రావాలని క్యాంప్ కార్యాలయం నుంచి సమాచారం వెళ్లినట్టు విశ్వసనీయవర్గాల సమాచారం. ఎట్టి పరిస్థితుల్లోనూ రెండు రోజుల వ్యవధిలో సంతకాలు పూర్తయి ఎమ్మెల్యే అనుచరులకు అందించాలని అధికారి హుకుం జారీ చేసినట్టు సమాచారం.

పట్టాలకు నగదు వసూలు

లబ్ధిదారుల అవసరాన్ని అవకాశంగా మలుచుకుని గడ్డం గ్యాంగ్, రెవెన్యూ అధికారి ప్రతి పట్టాకూ ధర నిర్ణయించారు. సుమారు 300 మంది లబ్ధిదారులను ఈ విధంగా గుర్తించి, వేరే వారి స్థానంలో వీరి పేర్లు చేర్చారు. ఈ క్రమంలో లబ్ధిదారులను రహస్యంగా క్యాంప్ కార్యాలయానికి పిలిచి రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు డిమాండ్ చేసినట్టు సమాచారం. వీఆర్వోలే లబ్ధిదారుల నుంచి వసూలు చేసి తీసుకురావాలని రెవెన్యూ అధికారి హుకుం జారీ చేశారు. వచ్చిన మొత్తంలో సగభాగాన్ని నందివాడ నుంచి వచ్చిన రెవెన్యూ అధికారి, ఎమ్మెల్యే నానికి అన్ని తానై నడిపించే రెవెన్యూ అధికారి, గడ్డం గ్యాంగ్ సభ్యులు పంచుకుంటున్నట్టు సమాచారం.

రెవెన్యూ అధికారి తీరు దారుణం

తాను చెప్పినట్టు విని సంతకాలు చేయాలని, లేనిపక్షంలో వారి వ్యవహారాన్ని వేరే విధంగా చూస్తానని సదరు రెవెన్యూ అధికారి దిగువ స్థాయి అధికారులపై బెదిరింపులకు పాల్పడుతున్నట్టు సమాచారం. నోటికి వచ్చిన బూతులు, రాయడానికి వీలు లేని దుర్భాషలతో వీఆర్వోలపై చిందులు తొక్కుతున్నట్టు రెవెన్యూ కార్యాలయ వర్గాలు చెబుతున్నాయి.

లబ్ధిదారుల పేర్లు రహస్యంగా..

సెంటు స్థలం పట్టాలు ఎవరికి ఇచ్చారో, ఏ వార్డుకు చెందిన వారో, ఏ గ్రామానికి చెందినవారో ఇప్పటికీ బహిర్గతం కాలేదు. గుట్టుచప్పుడు కాకుండా వార్డుల్లో, గ్రామాల్లో వైసీపీ నాయకులు పట్టాలను ఇళ్లకు వెళ్లి అందిస్తూ రానున్న ఎన్నికల్లో వైసీపీకి ఓటు చేయాలని కోరుతున్నట్టు తెలిసింది. రెండు రోజులుగా అర్జీలు పెట్టి ఇంటి స్థలం రాని పేదలను గుర్తించి వారిని హుటాహుటిన సచివాలయాలకు పిలిచి మళ్లీ ఆన్‌లైన్ చేయిస్తున్నారు. ఎన్నికల కోడ్ ఏ క్షణమైన అమలులోకి రానుండటంతో అధికార పార్టీ నాయకులు ఈ జిమ్మిక్కులకు పాల్పడుతున్నారు.



రంజాన్ వేళలు
ఇఫ్తార్ (సాయంత్రం) : 6-21 (గురు)
సహర్ (ఉదయం) : 4-56 (శుక్ర)

చిన్నారిపై వరాహం దాడి

- అడ్డుకోబోయిన అమ్మమ్మపై కూడా..
- గుడ్లవల్లేరులో ఘటన

- 6లో..



వరాహం దాడిలో గాయపడిన చిన్నారి హర్షిణి

ఒక్క ఇటుకా పడలేదు!



కమ్యూనిటీ హాల్ నిర్మాణ స్థలంలో పెరిగిన పిచ్చిమొక్కలు

నాలుగున్నరేళ్లుగా కదలికల్లేని కమ్యూనిటీ హాలు నిర్మాణం

- పందుల ఆవాస కేంద్రంగా మారిన స్థలం
- స్థానికులు ఎన్నిసార్లు విన్నవించినా స్పందించని ఎమ్మెల్యే కొడాలి నాని
- దశాబ్దాల కలను నీరుగార్చిన జగన్ సర్కార్

గుడివాడ : గుడివాడ మున్సిపాల్టీ పరిధిలో ఎప్పటి నుంచో మాదిగ సామాజికవర్గ పెద్దలు తమకు ఒక కమ్యూనిటీ హాల్ కావాలని కోరుతూ వస్తున్నారు. గత ప్రభుత్వంలో మున్సిపాల్టీ పరిధిలో బైపాస్ రోడ్డులోని డాక్టర్ కేకేఆర్స్ గౌతమ్ పాఠశాల ఎదురుగా ఉన్న మున్సిపల్ రిజర్వు స్థలంలో 2018లో రూ.45 లక్షల వ్యయంతో బాబుజగజ్జీవన్‌రామ్ పేరుతో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, అప్పటి మున్సిపల్ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు భూమిపూజ చేశారు. దీనికి మున్సిపల్ కౌన్సిల్ కూడా ఆమోదం తెలిపింది. కమ్యూనిటీ హాల్‌ను పూర్తిస్థాయిలో నిర్మించి అందుబాటులోకి తెవాలంటే రూ.2 కోట్లు కావాలని సంఘ పెద్దలు కోరారు. విడతల వారీగా నిధులను తీసుకువచ్చి పూర్తిస్థాయిలో భవనాన్ని సిద్ధం చేస్తామని రావి, యలవర్తి హామీ ఇచ్చారు. ఇంతలో ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో కమ్యూనిటీ హాల్ నిర్మాణం అటకెక్కింది.

పనులు నిలుపుదల చేసిన జగన్ సర్కార్

టీడీపీ ప్రభుత్వంలో తలపెట్టిన ఏ అభివృద్ధి కార్యక్రమమైనా నిలుపుదల చేయాలని సీఎం జగన్‌రెడ్డి అధికారులకు హుకుం జారీ చేశారు. దీంతో కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు ఆగిపోయాయి. దశాబ్దాల కల కలగానే మిగిలింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సంబంధించిన అభివృద్ధి పనులను వాయువేగంగా పూర్తి చేస్తామని సీఎం ఇచ్చిన హామీ ఏమైందని మాదిగ సంఘ పెద్దలు ప్రశ్నిస్తున్నారు.

చిట్టడవిని తలపిస్తున్న స్థలం

ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే నాని కమ్యూనిటీ హాల్ నిర్మాణంపై శ్రద్ధ చూపకపోవడంతో ఈ ప్రాంతం చిట్టడవిని తలపిస్తోంది. పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలతో పందుల ఆవాస కేంద్రంగా మారింది. ఆ ప్రాంతాన్ని మున్సిపల్ అధికారులు పూర్తిగా విస్మరించారు. వైసీపీ అధికారంలోకి వస్తే బాబు జగజ్జీవన్‌రామ్ కమ్యూనిటీ హాల్‌ను పూర్తి చేస్తానని గత ఎన్నికల్లో కొడాలి హామీ ఇచ్చి ఓట్లు దండుకున్నారు. మాదిగ సంఘ పెద్దలు కూడా ఎన్నికల అనంతరం కమ్యూనిటీ హాల్ నిర్మాణ విషయంలో పదులసార్లు ఎమ్మెల్యే నానిని కలిశారు. అయినా నాని నుంచి ఎటువంటి సమాధానం రాలేదు.

వైసీపీ నాయకుల మాటలు కోటలు దాటుతున్నా ఆచరణ గడప కూడా దాటడం లేదు. ఈ విషయంలో సీఎం జగన్, ఎమ్మెల్యే కొడాలి నాని ఇద్దరూ ఇద్దరే. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమానికి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నట్టు ఇస్తున్న బిల్డప్ అంతా ఇంతా కాదు. సీఎం జగన్ తాను మళ్లీ అధికారంలోకి వస్తే దళితుల సంక్షేమానికి పెద్దపీట వేస్తానంటూనే ఉన్న పీటలను లాగేశారు. జిల్లావ్యాప్తంగా దళితుల శ్మశానవాటికలు గానీ, కమ్యూనిటీ హాల్ నిర్మాణం గానీ చేపట్టిన దాఖలాలు లేవు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణాన్ని పూర్తి చేస్తా



టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి వస్తుంది. ప్రథమ ప్రాధాన్యతగా బాబు జగజ్జీవన్‌రామ్ కమ్యూనిటీ హాల్‌ను అన్ని హంగులతో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తా.
- వెనిగండ్ల రాము, టీడీపీ అభ్యర్థి

ఎన్నిసార్లు తిరిగినా ఫలితం లేదు



మాజీ మంత్రి కొడాలి నానికి దళితులంటే చిన్నచూపు. పార్టీలకతీతంగా సంఘ పెద్దలు పలుమార్లు నాని ఇంటి, కార్యాలయం చుట్టూ తిరిగినా ఫలితం లేదు. పట్టణంలో ఖాళీగా ఉన్న కవిరాజ కళామందిరాన్ని బాబు జగజ్జీవన్‌రామ్ కమ్యూనిటీ హాల్‌కు కేటాయించాలని కోరాం. అయినా ఎటువంటి సమాధానం రాలేదు.
- కంచర్ల సుధాకర్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

కాంక్రీట్ వేసి నిలబెట్టిన ఆట పరికరాలు



మంగళవారం సీన్..

కనకదుర్గమ్మ వారధి పక్కన, రిటైనింగ్ వాల్‌పై నిర్మించిన 'విజయవాడ రివర్ ఫ్రంట్' పార్కు.. చక్కటి వాతావరణం.. పచ్చటి మొక్కలు.. పిల్లలు ఆడుకునే ఆట పరికరాలు.. పెద్దలు వ్యాయామం చేసుకునే పరికరాలు.. అందమైన ప్రాంగణంతో కళకళలాడిన ఈ పార్కును సీఎం జగన్ ప్రారంభించి 'కృష్ణమ్మ జలవిహారం' అని నామకరణం చేశారు. ఇంకేముంది ఆహ్లాదకరమైన పార్కు మన ముంగిట వాలిందని స్థానికులు తెగ ఆనందపడిపోయారు. కట్ చేస్తే..

బుధవారం సీన్..

రివర్ ఫ్రంట్ పార్కు 'రివర్స్' అయ్యింది. మొండిగా నిలబడిన ఆటపరికరాలు.. ఊడిపడిన వ్యాయామ పరికరాలు.. కనిపించకుండా పోయిన పచ్చటి లాన్.. పూర్తికాని పనులు.. సందర్శకులను రానివ్వకుండా గేటు బయట సెక్యూరిటీ గార్డు.. సీఎం జగన్ వస్తున్నారని పైపై పనులతో, మొండి పరికరాలతో హడావిడి చేసిన అధికారులు ఆయన వెళ్లాక ఇప్పుడు తీరిగ్గా పనులు చేస్తూ సందర్శకులకు తేలిగ్గా నో ఎంట్రీ చెప్పేశారు.

రివర్స్ ఫ్రంట్..!

రివర్ ఫ్రంట్ పార్కు పరిస్థితి రివర్స్

- ప్రారంభం రోజే తొందర.. మరుసటిరోజు చిందరవందర
- సీఎం కోసం నామ్‌కే వాస్తేగా నిలబెట్టిన పరికరాలు
- ఇప్పుడు హడావిడిగా చేపడుతున్న పనులు
- సందర్శకులెవరూ రాకుండా సెక్యూరిటీ
- ఆశగా వచ్చిన స్థానికులకు నిరాశే..
- పనులు కానప్పుడు ప్రారంభమెందుకని ఆగ్రహం

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : కనకదుర్గమ్మ వారధికి దిగువన రూ.12.3 కోట్లతో నిర్మించిన రిటైనింగ్ వాల్‌ను ఆనుకుని విజయవాడ 'రివర్ ఫ్రంట్' పేరుతో నిర్మించిన పార్కుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇక్కడి నుంచి కృష్ణానది అందాలను వీక్షించవచ్చన్న కోణంలో ఈ పార్కును నిర్మించారు. వాల్ వెంబడి వాకింగ్ ట్రాక్, దీనికి రెండువైపులా లాన్ ఏర్పాటు చేశారు. వ్యాయామం చేసుకోవడానికి పరికరాలు, పిల్లలు ఆడుకోవడానికి ఆట పరికరాలను సిద్ధం చేశారు. సీఎం జగన్ మంగళవారం ప్రారంభించడానికి అనుకూలంగా సిద్ధం చేశారు.

ప్రారంభ కోసమే తొందర

విజయవాడ రివర్ ఫ్రంట్ పేరుతో పార్కును నిర్మించినా, దానికి సీఎం జగన్ కృష్ణమ్మ జలవిహారం అని నామకరణం చేసి ప్రారంభించారు. తొలిరోజు అధికారులు పార్కును సకల హంగులతో సిద్ధంచేసినా.. మరుసటిరోజు కళావిహీనంగా మారింది. సందర్శకులు లోపలకు వెళ్లకుండా ప్రధాన ద్వారం వద్ద సెక్యూరిటీ గార్డును నియమించారు. పార్కులో ఇంకా పనులు జరుగుతున్నాయని, మరో రెండు రోజుల సమయం పడుతుందని చెప్పి వచ్చిన సందర్శకులను, పిల్లలను వెనక్కి పంపేశారు. దీంతో సందర్శకులంతా నిరాశకు లోనయ్యారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో తాను చేసిన అభివృద్ధి ఇదీ.. అని చెప్పుకోవడానికి వీలుగా ఈ పార్కును జగన్ హడావిడిగా ప్రారంభించారని చుట్టుపక్కల వారు విమర్శిస్తున్నారు.

పనులన్నీ చిందరవందర

పుల్అప్స్ బార్, అప్ అండ్ డౌన్, ఊయల, ఫ్రంట్ అండ్ బ్యాక్, జారుడుబల్ల.. ఇవన్నీ చిన్నపిల్లలు ఆడుకునే పరికరాలు. పుల్అప్స్ బార్, ఫ్రంట్ అండ్ బ్యాక్‌పై యువకులు వ్యాయామం చేసుకుంటారు. పార్కు ప్రారంభోత్సవం రోజున ఇవన్నీ బాగానే ఉన్నాయి. బుధవారం మాత్రం నేలపై ఒరిగి ఉన్నాయి. సీఎం రాక కోసం వాటిని ఇసుకలో తాత్కాలికంగా నిలబెట్టామని అక్కడ పనులు చేస్తున్నవారు తెలిపారు. వాటిని పక్కనపెట్టి ఇప్పుడు శాశ్వతంగా అమర్చే పనులు సాగుతున్నాయి. గోతులు తవ్వి ఆ పరికరాలను నిలబెట్టి కాంక్రీట్ వేస్తున్నారు. పార్కుకు మొదటి ప్రదేశంలో మాత్రమే పనులు కొంతవరకు పూర్తయ్యాయి. లోపలకు వెళ్లేకొద్దీ గ్రావెల్ వేయడం, మొక్కలు నాటడం వంటి పనులు జరుగుతున్నాయి. గార్డెనింగ్ పనులు పూర్తిస్థాయిలో జరగలేదు. సీఎం సందర్శించిన ప్రదేశంలో మాత్రమే పనులను పూర్తిచేసి అధికారులు మమ అనిపించారు. పనులు పూర్తికాని పార్కు ప్రారంభోత్సవానికి ఇంత హడావుడి ఎందుకని సందర్శకులు మండిపడుతున్నారు.



మాక్ పార్లమెంట్‌లో పాల్గొన్న యువతకు సర్టిఫికెట్లు అందజేసిన నిర్వాహకులు

దేశ నిర్మాణంలో యువతది కీలక పాత్ర

» ఆకాశవాణి, ఏడీ శ్రీసాయి వెంపటి

అజిత్‌సింగ్‌నగర్, మార్చి 13 : దేశ నిర్మాణంలో యువత కీలక పాత్ర వహించాలని, రాజకీయాల్లో రాణించి దేశ పురోగతికి పాటుపడాలని విజయవాడ ఆకాశవాణి ఏడీ, శ్రీసాయి వెంపటి అన్నారు. నగరంలోని వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజీ ఆడిటోరియంలో బుధవారం 'నైబర్ హుడ్ యూత్ పార్లమెంట్' కార్యక్రమం జరిగింది. యువజన వ్యవహారాలు, క్రీడామంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి శ్రీసాయి వెంపటి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా యువతను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, యువత, యూత్ స్కిల్స్, బేటీ బచావో, బేటీ పడావో, వంటి ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాల ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే వివిధ పథకాల అమలు, దరఖాస్తులు, ప్రయోజనాలను వివరించారు. అలాగే ఆరోగ్యం, స్టార్టప్ ఇండియా, డిజిటల్ ఇండియాలో యువత పాత్ర, స్వచ్ఛభారత్, ఆయుష్మాన్ భారత్ అంశాలపై ప్రసంగించారు. అనంతరం విద్యార్థులు అధికార, ప్రతిపక్షసభ్యులుగా మాక్ పార్లమెంట్ నిర్వహించి తీర్మానం అందజేశారు. జిల్లాస్థాయి నైబర్‌హుడ్ యూత్ పార్లమెంట్‌కు హాజరైన వారందరికి సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం జిల్లా యువజన అధికారి సుంకర రాము మాట్లాడుతూ, యువత తమ అభిప్రాయాలను ధైర్యంగా తెలియజేయాలన్నారు. దేశ వ్యాప్తంగా యువత కోసం నెహ్రూ యువకేంద్ర సంఘటన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల డీన్ పాండురంగారావు, నైపుణ్యాభివృద్ధి అధికారి, ఎస్.శ్రీనివాస్, భవిరి శంకరనాథ్, శ్రీరాఘవశర్మ, కె.నరేంద్ర, నీలాంబరం, రఘువీర్, పి.రమేష్‌కుమార్, ఎం.జయరాజాన్‌లు పాల్గొన్నారు.



క్రీడాకారులను అభినందిస్తున్న స్టేడియం కమిటీ

ఉమ్మడి కృష్ణా చాంపియన్లుగా స్టేడియం పవర్‌లిఫ్టర్లు

గుడివాడ, మార్చి 13 : ఇటీవల జరిగిన ఉమ్మడి కృష్ణాజిల్లా పవర్ లిఫ్టింగ్ పోటీల్లో స్థానిక ఎన్టీఆర్ స్టేడియం జిమ్ లిఫ్టర్లు ఓవరాల్ చాంపియన్లుగా నిలిచారని స్టేడియం కమిటీ కోశాధికారి ఏవీ రామాంజనేయులు, జిమ్ కోచ్ మారెళ్ల వెంకటేశ్వరరావులు తెలిపారు. బుధవారం పతకాలు సాధించిన క్రీడాకారుల అభినందన కార్యక్రమం నిర్వహించారు. 105 కేజీల శరీర బరువు విభాగంలో కె.మాణిక్యాలరావు బంగారు పతకం, 66 కేజీల శరీర బరువు విభాగంలో డి.రాజ్‌కుమార్ వెండి పతకం, 74 కేజీల శరీర బరువు విభాగంలో కె.జీవన్‌కుమార్ బంగారు పతకం, 83 కేజీల శరీర బరువు విభాగంలో ఎం.అజయ్‌కుమార్ బంగారు పతకం, 84కేజీల శరీర బరువు విభాగంలో పి.స్వాతిశ్రీ బంగారు పతకం, 93కేజీల శరీర బరువు విభాగంలో జి.ధనుష్ బంగారు పతకం, 105కేజల శరీర బరువు విభాగంలో కె.ఫణికుమార్ వెండి పతకం సాధించారన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ జంపా ఉషాకుమారి, స్టేడియం మేనేజర్ ఎం.సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న హరిబాబు

ధాన్యం డబ్బు రూ. వెయ్యికోట్లు చెల్లించండి

» కౌలురైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరిబాబు

తోట్లవల్లూరు : రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం తోలిన రైతులకు రూ. వెయ్యి కోట్ల డబ్బులను 60 రోజులుగా ప్రభుత్వం విడుదల చేయటం లేదని, దీంతో రైతులు బ్యాంకుల వేధింపులు తట్టుకోలేకపోతున్నారని కౌలురైతు సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి మాగంటి హరిబాబు అన్నారు. తోట్లవల్లూరులో బుధవారం సాయంత్రం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 21 రోజులకే ధాన్యం డబ్బులు చెల్లిస్తామని చెప్పిన ప్రభుత్వం రెండు నెలలు గడిచినా చెల్లించకపోవటం దారుణమన్నారు. ధాన్యం బస్తా రూ. 1,640 ఉంటే మిల్లర్లు రూ 1,400 మాత్రమే రైతులకు చెల్లించాయని, మిల్లర్లకు ఆర్బీకేలు దళారీ కేంద్రాలుగా మారాయని ఆరోపించారు. ధాన్యం రైతులకు తక్షణమే డబ్బు చెల్లించాలని, లేకుంటే ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు. సమావేశంలో శీలం ప్రకాశరావు, సీహెచ్ రాజారావు, వీరంకి శ్రీనివాసరావు, ఎ.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

చిన్నారిపై వరాహం దాడి

» అడ్డుకోబోయిన అమ్మమ్మకూ తీవ్ర గాయాలు



వరాహం దాడిలో గాయపడిన చిన్నారి హర్షిణి, దాడిని వివరిస్తున్న అమ్మమ్మ

గుడ్లవల్లేరు, మార్చి 13 : ఇంటి వాకిట్లో ఆడుకొంటున్న మూడేళ్ల చిన్నారిపై వరాహం దాడి చేసింది. వరాహం దాడిని పసిగట్టిన పాప అమ్మమ్మ దానిబారి నుంచి పాపను విడిపించే ప్రయత్నం చేయగా ఆమె పైన కూడా దాడిచేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన గుడ్లవల్లేరులో బుధవారం రాత్రి చోటుచేసుకొంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక ప్రభుత్వాసుపత్రి ఎదురు వీధిలో నివాసం ఉంటున్న ఉదయశ్రీ మనవరాలు హర్షిణి అమ్మమ్మ ఇంట్లో పెరుగుతోంది. బుధవారం ఇంటి వాకిట్లో ఆడుకుంటున్న సమయంలో అక్కడకు వచ్చిన వరాహం హర్షిణి పైకి ఎగబడి దాడి చేసింది. చిన్నారి పెద్దగా కేకలు పెట్టడంతో ఇంటో ఉన్న ఉదయశ్రీ పరుగెత్తుకు వచ్చి ఆ వరాహాన్ని కొట్టే ప్రయత్నం చేయగా ఆమెపైన కూడా దాడి చేసింది. ఉదయశ్రీ జుట్టు నోట కరచి ఈడ్చుకు కొంతదూరం ఈడ్చుకు వెళ్లింది. వారి అరుపులు విన్న స్థానికులు వచ్చి వరాహాన్ని కర్రలతో కొట్టి వారిని విడిపించారు. బాధితులను స్థానిక ప్రయివేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స చేశారు. ఇటీవల కాలంలో కుక్కలు, పందుల దాడిలో గాయపడి ఆస్పత్రికి వస్తున్న బాధితులు పెరిగారని వైద్యుడు ఉప్పలపాటి వేణుగోపాలరావు పేర్కొన్నారు. గ్రామంలో విచ్చలవిడిగా వీధికుక్కలు, వరాహాలు గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రజలపై దాడి చేస్తున్నాయని గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. పంచాయతీ వారికి చెప్పినా ప్రయోజనం ఉండటంలేదని ఆరోపిస్తున్నారు.

ఆర్టీసీ ఎండీ పేరుతో నకిలీ ఎఫ్‌బీ అకౌంట్

» సైబర్ పోలీసులకు ఫిర్యాదు

విజయవాడ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : ఫేస్‌బుక్‌లో నకిలీ అకౌంట్లు సృష్టించడానికి సైబర్‌నేరగాళ్లు ఆర్టీసీ ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావును కూడా ఎంచుకున్నారు. ఆయన ఫొటోతో ఫేక్ అకౌంట్‌ను తెరిచారు. దీనిపై ఆయన విజయవాడలోని సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ద్వారకా తిరుమలరావు ఫొటోను ప్రొఫైల్‌లో అమర్చి, పక్కనే ద్వారకా తిరుమలరావు అని రాశారు. ఫొటో కింద తెలంగాణ స్టేట్ పోలీస్ అని, విజయవాడలో నివాసం ఉంటున్నట్టు రాశారు. తన పేరుమీద ఫేక్‌బుక్‌లో నకిలీ అకౌంట్ సృష్టించారని ఆయన తెలిపారు. తనకు ఏ సోషల్ మీడియాలోను అకౌంట్లు లేవని ఆయన స్పష్టం చేశారు.

ఓట్ల కోసమే.. దొంగ పట్టాల దగా!



ధర్నా చేస్తూ.. తహసీల్దార్ సతీష్‌కు దొంగ పట్టాలపై వివరిస్తున్న కొల్లు రవీంద్ర

» తహసీల్దార్ కార్యాలయం వద్ద టీడీపీ, జనసేన ధర్నా

» నాలుగు గంటలపాటు నిరసన.. తహసీల్దార్‌కు వినతిపత్రం

» అధికారంలోకి వచ్చాక అవినీతిపై సమగ్ర విచారణ

» వైసీపీ పాలకుల అక్రమాలు బయటపెడతాం : కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, మార్చి 13 : కృష్ణా జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో పేదలకు వైసీపీ పాలకులు వందలాది దొంగ పట్టాల పంపిణీపై మాజీమంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి కొల్లు రవీంద్ర ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన నేతలు బుధవారం ఉదయం నాలుగుగంటలపాటు ధర్నా నిర్వహించారు. తహసీల్దార్ శిబిరం వద్దకు రావాలంటూ నినాదాలు చేశారు. రాజముద్ర, తేదీలు లేకుండా పట్టాలు ఫోర్జరీ సంతకాలతో ఎలా ఇచ్చారని కొల్లు రవీంద్ర డిప్యూటీ తహసీల్దార్‌ను ప్రశ్నించారు. మూడు గంటల ఆలస్యంగా కార్యాలయానికి తహసీల్దార్‌తో కార్పొరేటర్లు చర్చలు జరిపారు. వైసీపీ నాయకులు లబ్ధిదారులకు ఇచ్చిన నకిలీ పట్టాలను తహసీల్దార్‌కు చూపించారు. ఎన్నికల ముందు పేదలకు పట్టాల పేరుతో ఎర వేస్తున్నారని వారు ధ్వజమెత్తారు. ప్రజలకు ఇచ్చిన పట్టాలు రిజిస్టర్‌లో నమోదు అయ్యాయా అని ప్రశ్నించారు. దానికి రెవెన్యూ అధికారులు రిజిస్టర్ చూపించలేక పోవడంతో నిజాలు నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు. దీనిపై అవసరమైతే ఆమరణ దీక్షకు దిగుతానని రవీంద్ర పేర్కొనడంతో శిబిరంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. బదిలీ అయిన తహసీల్దార్ సునీల్ సంతకాలతో అర్ధరాత్రి వేళ వైసీపీ నాయకుల సమక్షంలో తహసీల్దార్ కార్యాలయంలో పట్టాలు రాయాలంటూ అధికారులపై వత్తిడి చేస్తున్నారని కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు. తనకురెండు రోజుల సమయం ఇస్తే విచారణ జరిపి వివరాలు చెపుతానని తహసీల్దార్ పేర్కొనడంతో ధర్నాను వాయిదా వేశారు. శిబిరం వద్దే నాయకులు, కార్యకర్తలు భోజనాలు చేశారు. ధర్నాలో జనసేన, టీడీపీ నేతలు మాదివాడ రాము, గడ్డం రాజు, మోటమర్రి బాబాప్రసాద్, పంచపర్వాల కాశీవిశ్వనాథం, కుంచె నాని, ఎండి ఇలియాస్ పాషా, పిప్పళ్ల కాంతారావు, కార్పొరేటర్లు మరకాని సమతా కీర్తి, చిత్తజల్లు నాగరాము, అన్నం ఆనంద్, దేవరపల్లి అనిత, కట్టా దుర్గా, సనకా నాగులు, మరకానిపరబ్రహ్మం, పీవీ ఫణికుమార్, పాలపర్తి పద్మ, చిన్నం శివ, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

జి+3 ఇల్లు రద్దు చేసి స్థలం పట్టా ఇచ్చారు

» లబోదిబోమన్న బాధిత మహిళ



మచిలీపట్నం 32వ డివిజన్‌కు చెందిన మహిళ గంజాల జాబాబ్‌కు రుద్రవరంలో జి+3 ఇల్లు మంజూరైంది. అయితే ఆ ఇంటిని బలవంతంగా రద్దు చేసి కరగ్రహారంలో ఇంటి స్థలం అంటగట్టారని బాధితురాలు లబోదిబోమంటోంది. బుధవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆమె మీడియాకు తన గోడును వెళ్లబోసుకుంది. - **మచిలీపట్నం టౌన్**

ఓటమి భయంతోనే దొంగపట్టాలు

పేదలకు పట్టాలు ఇవ్వడానికి తాను వ్యతిరేకం కాదని, అయితే రోడ్ల పక్కన స్థలాలకు రాత్రికి రాత్రి దొంగ పట్టాలు సృష్టించి ఇస్తున్నారని రవీంద్ర అన్నారు. రవీంద్ర మీడియాతో మాట్లాడుతూ, బదిలీ అయిన తహసీల్దార్ సునీల్ సంతకంతో వందల సంఖ్యలో ఎమ్మెల్యే పేర్నినాని ఆధ్వర్యంలో దొంగ పట్టాలు ఇస్తున్నారన్నారు. నేషనల్ కాలేజీ వద్ద, ఎన్టీఆర్‌కాలనీ వద్ద, విశ్వబ్రాహ్మణ కాలనీ ఇలా పలుప్రాంతాల్లో సర్వే నెంబర్లు లేకుండా పట్టాలు ఇచ్చేస్తున్నారన్నారు. సర్వే నెంబర్లు లేని ఇళ్లకు బ్యాంకులు ఎలా రుణాలు ఇస్తాయన్నారు. సుల్తానగరంలోని ప్రభుత్వ భూములను వైసీపీ కార్యకర్తలు ఆక్రమించి అమ్ముకుంటున్నారన్నారు. వైసీపీ నేతల అక్రమాలపై అధికారంలోకి వచ్చిన తరువాత విచారణ జరిపిస్తామన్నారు.

160 సీట్లు గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం

» పార్టీ శ్రేణులకు దేవినేని ఉమా పిలుపు

మైలవరం/గొల్లపూడి, మార్చి 13 : వచ్చే ఎన్నికల్లో అవినీతి, అరాచక వైసీపీ ప్రభుత్వానికి ఓటుతో బుద్ధి చెప్పి చిత్తుగా ఓడించడమే కాకుండా 160 సీట్లు గెలుపే లక్ష్యంగా పని చేద్దామని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో కేడర్‌కు పిలుపునిచ్చారు. సైకో విధ్వంసకర పాలనతో రాష్ట్రం 20 ఏళ్లు వెనక్కి వెళ్లిందన్నారు. జీవనాడి పోలవరం పూర్తి కావాలన్నా, రాజధాని అమరావతి కట్టాలన్నా, పెట్టుబడులు, పరిశ్రమలు రావాలన్నా ఇవన్నీ జరిగి రాష్ట్రం బాగుపడాలంటే తెలుగుదేశం-జనసేన-బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇందుకోసం ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేయాలన్నారు. మహిళల కోసం సరికొత్త పథకం కలలకు రెక్కలు పేరుతో కొత్త కార్యక్రమానికి టీడీపీ శ్రీకారం చుట్టిందని అన్నారు.

సీటు మార్పు వెనుక మర్మమేమిటో?

» వైసీపీ ఎమ్మెల్యే రక్షణనిధి అసంతృప్తి



తిరువూరు, మార్చి 13 : పార్టీ నిర్వహించిన ప్రజాభిప్రాయ సర్వే.. ఐప్యాక్ సర్వేలో 69 శాతం మంది ప్రజలు తనకు మద్దతు తెలిపినా.. సీటు తనకే ఇస్తానని ముందుగా చెప్పిన పార్టీ అధిష్ఠానం తనకు గాక మరొకరికి సీటు కేటాయించడంలో మర్మమేమిటో అని ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో పార్టీ అధిష్ఠానంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. గడప గడపకు కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తిచేయడంతో పాటు నియోజకవర్గంలో 77 సచివాలయాల నిర్మాణం, రోడ్ల అభివృద్ధి, పార్టీ పిలుపు ఇచ్చిన ప్రతి కార్యక్రమం పూర్తిచేసిన తొలి ఎనిమిది మందిలో జాబితాలో తన పేరు ఉందని ఆయన పేర్కొన్నారు. సీటు ఇస్తామని చెబుతూనే మరోవైపు సర్వే చెయిస్తుండంతో మనస్తాపంతో పార్టీకి, నియోజకవర్గానికి దూరంగా ఉంటున్నట్టు పేర్కొన్నారు. ముఖ్యమంత్రిని కలిసే అవకాశం లేకపోవడంతో పార్టీలో ఏం జరుగుతుందో తెలియని అయోమయ పరిస్థితి నెలకొందన్నారు.



పార్టీ నిర్వహించిన సర్వే రిపోర్టు

కేంద్రంలో మోదీ వస్తేనే రాష్ట్రం అభివృద్ధి

వైసీపీకి, రాజకీయాలకు దూరం అంటూనే కేంద్రంలో మూడోసారి మోదీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే రక్షణనిధి పేర్కొనడంతో రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తును స్వాగతిస్తున్నట్టు పరోక్షంగా పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారా.. అభిమానులకు సూచనలు చేస్తారా? అన్న ప్రశ్నకు ఎవరి అభీష్టం మేరకు వారు ఆయా పార్టీలకు మద్దతు ఇస్తారని ఆయన సమాధానం చెప్పారు.

రోత రాతలతో ఫ్లెక్సీ!

» వైసీపీ నేత పేరుతో ఛాలెంజ్‌లు » అసభ్య పదజాలాలు

» పట్టించుకోని పోలీసులు, మునిసిపల్ అధికారులు

» ప్రశాంత వాతావరణాన్ని కలుషితం చేస్తున్నారంటూ విమర్శలు



పోరంకి సెంటర్‌లో రోత రాతతో వెలిసిన ఫ్లెక్సీ

పెనమలూరు, మార్చి 13 : "ఒరేయ్ నీకే చెబుతున్నా...జగనన్న కోసం జోగన్నతో మేము సిద్ధం.. మీకు దమ్ముంటే బ్యానర్లమీద కాదురా! మీప్రతాపం ఫేస్ టు ఫేస్ చూసుకుందాం రా చెత్త నా.." ఇవి వైసీపీ నాయకుడిగా చెలామణి అవుతున్న పోరంకికి చెందిన అద్దేపల్లి చందు పేరుతో వెలిసిన ఫ్లెక్సీలోని పదజాలం. గత రెండు రోజులుగా ఈ ఫ్లెక్సీ పోరంకి సెంటరు బందరు రోడ్డుపై హల్‌చల్ చేస్తోంది. బందరు రోడ్డుపై ప్రయాణించే వారికి ఇది జుగుప్స కలిగే విధంగా ఉన్నా పోలీసులకు, మునిసిపల్ అధికారులకు ఏమాత్రం పట్టడం లేదు. గతంలో ఇతడు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను ఇతడంటే గిట్టని సొంత పార్టీ వారే చించి పడేయడంతో ఇలాంటి పరుష పదజాలంతో ఈ ఫ్లెక్సీని ఏర్పాటు చేసినట్లు సమాచారం. మంత్రి జోగి రమేష్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇలాంటి రెచ్చగొట్టే సంఘటనలు పెనమలూరు నియోజకవర్గంలో జరగడం పరిపాటిగా మారిందని పలువురు విమర్శిస్తున్నారు. ప్రశాంతంగా ఉండే కృష్ణా జిల్లా రాజకీయాలను వైసీపీ నేతల పోకడలు కలుషితం చేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఎన్నికల ఫీవర్

ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగానికి ఎన్నికల ఫీవర్ వచ్చేసింది. రెండు నెలలుగా ఎన్నికల విధుల్లో తలమునకలై ఉన్న అధికారులు ఇక నిరంతర ఏర్పాట్లపై దృష్టి సారిస్తున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడటమే తరువాయి.. మరింత అప్రమత్తమవుతూ.. ప్రస్తుత విధులతో పాటు ఎన్నికల విధులూ కొనసాగించాల్సి ఉండటంతో ఆ ప్రక్రియ విజయవంతం చేసేందుకు జిల్లా యంత్రాంగం సర్వసన్నద్ధమైంది.

» ఇప్పటికే విధుల్లో అధికారులు బిజీ బిజీ

» కొనసాగుతున్న ఫామ్ 6, 7, 8ల పరిష్కారం

» ఎన్నికల సిబ్బందికి అవగాహన, శిక్షణ కార్యక్రమాలు

» పోలింగ్ సిబ్బందికి విధుల కేటాయింపులు

» పోలింగ్ కేంద్రాల పరిశీలన, సౌకర్యాల పర్యవేక్షణ

» రాజకీయ పార్టీలతో తరచూ సమావేశాలు

» సీఈవో వీసీలు, జిల్లా వీసీలతో క్షణం తీరికలేని పరిస్థితి

» నోటిఫికేషన్ నుంచి అదనపు కీలక బాధ్యతలు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

ఎన్నికల విధుల్లో కృష్ణా, ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం తలమునకలైంది. ఓటర్ల నమోదు, జాబితాల స్వచ్ఛీకరణ, స్పెషల్ సమ్మరీ రివిజన్ (ఎస్ఎస్ఆర్), ఫామ్స్ స్వీకరణ-పరిశీలన, తొలగింపులు, పోలింగ్ కేంద్రాల పరిశీలన, ఏర్పాట్ల పర్యవేక్షణ, ఈవీఎంల నిరంతర తనిఖీతో పాటు వాటిని సన్నద్ధం చేయటం, పోలింగ్ విధులను నిర్వహించే సిబ్బందిని సన్నద్ధం చేయటం, నోడల్ ఆఫీసర్ల నియామకం-వారిచే నిర్వహించచాల్సిన బాధ్యతలను పర్యవేక్షించటం, స్ట్రాంగ్‌రూమ్, పోలింగ్ కేంద్రాల సందర్శనలు, తరచూ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాలు, జిల్లా అధికార యంత్రాంగంతో సమీక్షలు, ఈసీఐతో వీసీలు, అన్నింటికీ మించి పోలింగ్ అధికారులు, సిబ్బందికి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించటం వంటి కార్యకలాపాలతో జిల్లా యంత్రాంగం ఉక్కిరిబిక్కిరవుతోంది. ఈ కార్యక్రమాలు నామినేషన్ల తుదిఘట్టం వరకు కొనసాగుతాయి. నోటిఫికేషన్ వస్తే అదనంగా నిర్వహించాల్సిన విధులు అనేకం ఉన్నాయి. నోటిఫికేషన్ వచ్చినప్పటికీ నామినేషన్ల ఘట్టం పూర్తయ్యే వరకు ఫామ్స్ స్వీకరణ ప్రక్రియ కొనసాగుతుంది. రెండు నెలల క్రితం జరిగిన స్పెషల్ సమ్మరీ రివిజన్ (ఎస్ఎస్ఆర్) అనంతరం రాజకీయ పక్షాల, ఓటర్ల నుంచి వచ్చిన ఫామ్ 6, 7, 8లకు సంబంధించిన దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతోంది. క్షేత్రస్థాయిలో పరిశీలన చేసిన తర్వాత అభ్యంతరాలు లేకపోతేనే వీటిని పరిష్కరించాల్సి ఉంటుంది. ఎన్నికల నోటిఫకేషన్‌తో సంబంధం లేకుండా ప్రక్రియను నామినేషన్ల ఘట్టం ముగిసే వరకు పరిష్కరిస్తారు. అలాగే పోలింగ్ కేంద్రాల సన్నద్ధత, సౌకర్యాల కల్పన, ఎన్నికల సిబ్బందికి శిక్షణా కార్యక్రమాలు నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలి. పోలింగ్ కేంద్రాలను అవసరం మేరకు మార్పే అవకాశాలు ఉంటాయి. ఎన్టీఆర్ జిల్లాలో 20 మండలాలు, మూడు రెవెన్యూ డివిజన్లు ఉన్నాయి. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. వీటికి సంబంధించిన ఎన్నికల విధులతో పాటు కృష్ణాజిల్లాకు చెందిన గన్నవరం నియోజకవర్గంలో కొన్నిగ్రామాలు ఎన్టీఆర్ జిల్లాలో ఉన్నందున వాటికి సంబంధించిన విధులను కూడా నిర్వహించాల్సి ఉంటుంది. ఎన్టీఆర్ జిల్లా పరిధిలో ఎనిమిది మంది రిటర్నింగ్ ఆఫీసర్లు, సహాయ రిటర్నింగ్ అధికారులు-44, ఈఆర్ఓలు-7, ఏఈఆర్‌వోలు-36, సెక్టార్ ఆఫీసర్లు-169, సెక్టార్ పోలీస్ ఆఫీసర్స్-169 మంది, ప్రిసైడింగ్ ఆఫీసర్స్-2137 మంది, పోలింగ్ ఆఫీసర్స్-10,866 మంది, బీఎల్‌వోలు-1863మంది, నోడల్ ఆఫీసర్లుగా ఇప్పటికే 16మందిని ఎంపిక చేయటం జరిగింది. వీరితో పాటు ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఏడువేల మంది పోలీసు బలగాలు అవసరమని నిర్ణయించారు. ప్రస్తుతం పోలీసు బలగాల కొరత ఉంది. జిల్లావ్యాప్తంగా సమస్యాత్మక ప్రాంతాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఇదే సందర్భంలో సరిహద్దు ప్రాంతాలపైనా నిఘా ఉంచాల్సిన అవసరం ఉంది. ఇలా దాదాపుగా జిల్లా యంత్రాంగం పూర్తిగా ఎన్నికల విధుల్లో తలమునకలుగా ఉంది. ఎన్నికల నోటిఫికేషన్ వస్తే కోడ్ అమల్లోకి వచ్చే పరిస్థితుల్లో ప్రవర్తనా నియమావళిని అమలుచేయటం, మీడియా పర్యవేక్షణ, పోలింగ్ మెటీరియల్‌ను సిద్ధం చేసుకోవటం, ఎపిక్‌కార్డులను ఎన్నికల నాటికల్లా ముద్రించి అందచేయటం వంటి విధులు, ఇవికాకుండా నామినేషన్లను స్వీకరించటం, అభ్యర్థుల ప్రచారఖర్చులను లెక్కలు వేయటం, ఎన్నికల ఫిర్యాదులను పరిష్కరించటం, యాప్‌ల వినియోగాన్ని సమీక్షించటం వంటివి నిరంతరాయంగా కొనసాగించాల్సి ఉంటుంది. ఎన్నికల నిర్వహణ తర్వాత.. ఈవీఎంలను భద్రపరచటం కూడా కీలకమే.. స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరచటం, కౌంటింగ్ కేంద్రాలకు ఈవీఎంలను తరలించటం దగ్గర నుంచి ఎన్నికల ఫలితాలు పూర్తయ్యేవరకు జిల్లా యంత్రాంగం విధుల్లో తలమునకలై ఉంటుంది.

మూడంచెల భద్రతా ఏర్పాట్లు

» కృష్ణా వర్సిటీలో కౌంటింగ్ కేంద్రాలు పరిశీలించిన కృష్ణాజిల్లా కలెక్టర్, అధికారులు



కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద భద్రతా ఏర్పాట్లపై అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ రాజాబాబు

మచిలీపట్నం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాయూనివర్సిటీలో ఏర్పాటు చేయనున్న స్ట్రాంగ్‌రూమ్‌లు, ఓట్లలెక్కింపు కేంద్రాలు వద్ద మూడంచెల భద్రతను ఏర్పాటు చేయనున్నట్టు కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. జేసీ గీతాంజలి శర్మ, ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, రిటర్నింగ్ అధికారులతో కలిసి బుధవారం వర్సిటీలోని స్ట్రాంగ్‌రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు, పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించిన ఓట్ల లెక్కింపు కృష్ణాయూనివర్సిటీలో జరుగుతుందన్నారు. పోలింగ్ అనంతరం ఈవీఎంలను వర్సిటీకి తరలించడం జరుగుతుందన్నారు. ఇక్కడ 100మీటర్లు, 200మీటర్లు, 300మీటర్ల పరిధిలో కేంద్ర బలగాల పర్యవేక్షణలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. అసెంబ్లీ నియోజకవర్గాలు, పార్లమెంటు,అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ఈవీఎంలను వేర్వేరు గదుల్లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ల్లో భద్రపరుస్తామన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాలవారీగా శాసనసభ, పార్లమెంటు నియోజకవర్గాల ఓట్ల లెక్కింపుకోసం విడివిడిగా కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటు, ఈవీఎంలను కౌంటింగ్ కేంద్రాల్లోకి తీసుకువచ్చే మార్గాలు, బారికేడింగ్, తదితర అంశాలపై అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. కౌంటింగ్ కేంద్రాల్లో అభ్యర్థులకు సంబంధించిన కౌంటింగ్ ఏజెంట్ల రాకపోకలకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల్లో తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై ఎస్పీకి కలెక్టర్ పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, ఏఎస్పీ ఎస్వీడీ ప్రసాద్, కృష్ణాయూనివర్సిటీ వీసీ జ్ఞానమణి, రిజిస్ట్రార్ శోభన్‌బాబు ఉన్నారు.

పెండింగ్ ఓటరు దరఖాస్తులు పరిశీలిస్తున్నాం

జిల్లాలో పెండింగ్ ఉన్న 5415ఓటర్ల దరఖాస్తులను సత్వరం పరిష్కరించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. ముఖేష్‌కుమార్ మీనా కలెక్టర్‌లు, ఎస్పీలతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా కలెక్టరేట్ నుంచి కలెక్టర్, జేసీ గీతాంజలి శర్మ, ఎస్పీ అద్నాన్‌నయీం అస్మి పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఫారం 6, 7, 8 దరఖాస్తులు ఇంకా 5415పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పరిశీలన చేసి పరిష్కరించే పనిని వేగవంతం చేస్తున్నట్టు తెలిపారు. ఏడు రోజులకు మించిన దరఖాస్తులు 1792 ఉండగా, వాటిలో ఫారం-7కు సంబంధించిన దరఖాస్తులు 1100వరకు ఉన్నట్టు తెలిపారు. వీటిని రాష్ట్ర ఎన్నికలసంఘం పరిశీలనకు పంపామన్నారు. తపాలశాఖ ద్వారా 55446 దరఖాస్తులు పంపిణీ కోసం పంపామని, ఇవి సకాలంలో ఓటర్లకు అందేలా తగు చర్యలు తీసుకోవాలని తపాలశాఖ అధికారులకు సూచన చేశామన్నారు. సమావేశంలో డీఆర్వో కె.చంద్రశేఖరరావు, రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా పటిష్ట చర్యలు..

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

కృష్ణలంక, మార్చి 13 : రానున్న సాధారణ ఎన్నికలను నిష్పక్షపాత, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు ఈసీఐ, సీఈవో మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేస్తున్నట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితా నవీకరణ, వివిధ ఫారాల పరిష్కారం, క్రిటికల్, వల్నరబుల్ పోలింగ్ స్టేషన్ల గుర్తింపు ప్రక్రియ, ఏర్పాట్లు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ), వ్యయ పరిశీలన తదితరాలపై కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఫారం-6కు సంబంధించి 3571, ఫారం-7కు సంబంధించి 1361, ఫారం-8కు సంబంధించి 2113 దరఖాస్తులను పరిష్కరించాల్సి వుందని, వీటిని నిబంధనలకు అనుగుణంగా పరిష్కరించనున్నట్టు వివరించారు. పోలింగ్ స్టేషన్ స్థలం, ఏరియా, అనుసంధానించిన మొత్తం ఓటర్లు తదితర అంశాలతో కూడిన జాబితా (అనెక్చర్-3)ను రాజకీయ పార్టీలకు అందించనున్నట్టు తెలిపారు. షెడ్యూల్ విడుదలతో అమల్లోకి రానున్న ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ), ఫిర్యాదులకు వీలుకల్పించే సీ విజిల్ యాప్, 1950 ఈసీఐ టోల్‌ఫ్రీం నెంబర్ తదితరాల గురించి కలెక్టర్ వివరించారు. సమావేశంలో డీఆర్వో వి.శ్రీనివాసరావు, పలు పార్టీల ప్రతినిధులు ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	112, 121, 132
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.33

ఎన్నికలకు సర్వంసిద్ధం: సీఐ



కోలవెన్ను (కంకిపాడు), మార్చి 13 : సార్వత్రిక ఎన్నికలకు తాము సిద్ధంగా ఉన్నామని సీఐ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కోలవెన్ను, పునాదిపాడు, గొల్లగూడెం, కుందేరు గ్రామాల్లో బుధవారం ప్రత్యేక బృందాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ, మరో ఒకటి రెండు రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ రానున్న నేపథ్యంలో పోలీసులు సమ స్యాత్మక ప్రాంతాల్లో గస్తీ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై డి. సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఐవీఆర్‌ఎస్‌లో బోడె పేరు

●ఆనందంలో టీడీపీ నాయకులు

కంకిపాడు, మార్చి 13 : పెనమలూరు నియోజక వర్గంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఒక్క సారిగా బలం వచ్చినట్లు అయింది. గత కొంత కాలంగా పెనమలూరు నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి పేరు తేల్చకపోవడంతో ఆ పార్టీ కార్యకర్తలు, నాయకులు అయోమయంలో ఉన్నారు. బుధవారం చంద్రబాబు నాయుడు పేరుతో నిర్వహించిన ఐవీఆర్‌ఎస్‌లో మీ నియోజక వర్గంలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా బోడె ప్రసాద్ అయితే ఒకటి నొక్కండి. నోటా అయితే అయితే రెండు నొక్కండి అంటూ వాయిస్ కాల్స్ వచ్చాయి. దీంతో నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తల్లో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. బోడె ప్రసాద్‌కు సీటు కేటాయిస్తే గెలుపించుకుంటామని నాయకులు, కార్యకర్తలు భరోసా ఇస్తున్నారు.

సొసైటీల బలోపేతానికి కృషి

ఇఫ్కో ఆర్‌జీబీ మూల్పూరు ప్రభుకాంత్

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 13 : సహకార సంఘాల బలోపేతానికి తద్వారా రైతులకు మరింతగా సేవలందించేందుకు ఇఫ్కో సహకారంతో కృషి చేస్తానని తిప్పనగుంట పీఏసీఎస్ అధ్యక్షుడు మూల్పూరు ప్రభుకాంత్ తెలిపారు. ఇండిపెండెంట్ ఫార్మర్స్ ఫెర్టిలైజర్స్ కోఆపరేటివ్ (ఇఫ్కో) ఆర్‌జీబీగా కృష్ణాజిల్లా తరపున ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజయవాడలోని ఇఫ్కో కార్యాలయంలో ఎన్నికల అధికారి నంద కిషోర్‌రెడ్డి పర్యవేక్షణలో మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రభుకాంత్‌కు నంద కిషోర్‌రెడ్డి నియామకపత్రాన్ని అందజేశారు.

క్రీడలతో మానసికోల్లాసం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 13 : క్రీడల్లో పాల్గొనడం వల్ల మానసికోల్లాసం, క్రీడాస్ఫూర్తి పెంపొందుతాయని మానవత రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు విద్యార్థులకు సూచించారు. కానుమోలు హైస్కూల్‌లో ఖోఖో పోల్స్‌ను మానవత సేవా సంస్థ ద్వారా హెచ్‌ఎం పద్మజ, పీడీ రామచంద్రుడుకు బుధవారం అందజేశారు. చదువుతో పాటు క్రీడలకు కూడా తగిన ప్రాధాన్యత నిస్తూ ప్రతి విద్యార్థి క్రీడల్లో పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో మానవత అధ్యక్షుడు కూరెళ్ల సుబ్బాచారి, కార్యదర్శి కళ్లేపల్లి నారాయణరావు, డైరెక్టర్లు కొట్నాని రామచంద్రరావు, వేగిరెడ్డి సూర్యనారాయణ, జన్యావుల సత్యన్నారాయణ పాల్గొన్నారు.

ధనేకుల విద్యార్థులకు
ఉపకారవేతనాలు



ఉపకారవేతనాలు పొందిన విద్యార్థులతో యాజమాన్యం

పెనమలూరు, మార్చి 13 : గంగూరు శ్రీధనేకుల ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు డాక్టర్ చిట్టూరి రత్నం నార్త్ సౌత్ ఫౌండేషన్ ఉపకార వేతనాలను అందజేసింది. కళాశాలకు చెందిన పదిమంది విద్యార్థులకు రూ.1.60 లక్షలను డిప్లొమా, ఇంజనీరింగ్ విద్యార్థులకు బుధవారం అందించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ రవీంద్రనాథ్ ఠాగూర్, డైరెక్టర్ రవిప్రసాద్, సెక్రటరీ భవానీ ప్రసాద్, ప్రిన్సిపాల్ రవి తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం

ఉయ్యూరు, మార్చి 13 : ఇద్దరి వ్యక్తుల మధ్య ఘర్షణ హత్యాయత్నానికి దారితీసింది. ఉయ్యూరు పట్టణ పోలీసుల వివరాల ప్రకారం.. సౌభాగ్య నగర్ చెందిన కె ప్రకాశ్‌బాబు, షేక్ మున్నా మధ్య మంగళవారం రాత్రి దారి విషయమై గొడవ జరిగింది. దీంతో ఆగ్రహించిన షేక్‌మున్నా ప్రకాశ్‌బాబును పొదునైన ఆయుధంతో పొడవగా తీవ్రగాయమైంది. బంధువులు స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం విజయవాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

వీరపనేనిగూడెం సొసైటీలో
నూరుశాతం రుణాల వసూళ్లు

గన్నవరం, మార్చి 13 : రైతులకు, డ్వాక్రా మహిళలకు రుణాలు ఇవ్వటమే కాకుండా సకాలంలో వసూలు చేసి జిల్లాలో మొదటి స్థానంలో నిలిచామని పీఏసీఎస్ చైర్‌పర్సన్ బొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని వీరపనేనిగూడెం పీఏసీఎస్‌లో నూరుశాతం రుణాలు వసూళ్లు పూర్తైనట్లు బుధవారం కేడీసీసీ బ్యాంకు చీఫ్ మేనేజర్‌కు లెటర్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ సబ్బీర్, సూపర్‌వైజర్ నాగేశ్వరరావు, సీఈవో అశోక్‌కుమార్, నందూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో
ఆధునిక వైద్య సౌకర్యాలు

ఉంగుటూరు, మార్చి 13 : గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆధునిక వైద్య సౌకర్యాలను అందుబాటులోకి తెచ్చి, ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను(పీహెచ్‌సీ) ఆధునాతనంగా తీర్చిదిద్దుతోందని ఇందుపల్లి సర్పంచ్ బండి వెంక టలక్ష్మి అన్నారు. నూతనంగా నిర్మించిన 10పడకల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాన్ని బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వీర్ల వెంకటేశ్వరరావు, కూరాకుల వెంకట్రామయ్య, డాక్టర్ బి.శిరీష, డాక్టర్ వీవీ సుబ్బారావు పాల్గొన్నారు.

పోలీసుల కవాతు

కూచిపూడి, మార్చి 13 : సార్వత్రిక ఎన్నికలను పురస్క రించుకుని కేంద్ర బలగాలు, స్థానిక పోలీసులు సంయుక్తంగా మొవ్వ మండలంలోని పలు గ్రామాల్లో కవాతు నిర్వహించారు. మొవ్వ, కూచిపూడి, అయ్యంకి తదితర గ్రామాల్లో కవాతు నిర్వహించారు.

అర్హులకు మొండిచేయి!

- బాపులపాడు మండలంలో 11వేలు మంది అర్హులుగా గుర్తింపు, 3,541 మందికి మాత్రమే పట్టాలు పంపిణీ
- మల్లవల్లి, రంగన్నగూడెం, బండారుగూడెం, కె.సీతారాంపురంలో నేటికి పంపిణీ కాని ఇళ్ల స్థలాలు

హనుమాన్‌జంక్షన్, మార్చి 13 : అర్హులైన పేదలందరికి ఇళ్ల స్థలాలు పంపిణీ చేసి సొంతింటి కల నెరవేరుస్తానని సీఎం జగన్ చేసిన వాగ్దానం బాపులపాడు మండలం లోని కొన్ని గ్రామాల్లో కలగా మిగులుతోంది. మండలంలో 25 గ్రామాలకు గాను 21 గ్రామాల్లో మాత్రమే అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు. మల్లవల్లి, రంగన్నగూడెం, బండారు గూడెం, కె.సీతారాంపురం గ్రామాల్లో నేటికి ఇళ్ల స్థలాలు పంపిణీ చేయలేదు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదేళ్లు అవుతున్నా సొం తింటి కల నెరువే రుతుందని అర్హులైన పేదలు ఆశగా ఎదురు చేస్తున్నారు. మండలంలో ఇప్పటి వరకు 11వేలకు పైగా అర్హులు ఉండగా ఇప్పటి వరకు 3541 మందికి మాత్రమే పట్టాలు పంపిణీ చేశారు. ప్రభుత్వ, పోరంబోకు భూముల్లో కొంత మందికి, కొన్ని గ్రామాల్లో రైతులు వద్ద కొనుగోలు చేసి పేదలకు పంపిణీ చేశారు. మల్లవల్లి మొదటి విడత అర్హుల జాబితాను 500 పైచిలుకు గుర్తించారు. ఏపీఐఐసీకి కేటాయించిన అటవీ పోరంబోకు భూమిలో పేదల ఇళ్లస్థలాల కోసం 100 ఎకరాలు కేటాయించారు. గ్రామస్థుల అభ్యంతరంతో నేటికి పట్టాల పంపిణీ చేయలేదు.

●రంగన్నగూడెంలో 147 మంది మొదటి విడత అర్హులుగా గుర్తించారు. వారందరికి గ్రామంలోని చెరువు భూమిలో స్థలాలు కేటాయించడంతో చెరువు భూమిలో స్థలాలు కేటాయించడాన్ని గ్రామస్థులు అభ్యంతరం వ్యక్తం చేస్తు కోర్టును ఆశ్రయించారు. దీంతో ఆ గ్రామంలోని పేదలకు పట్టాలు పంపిణీ జరగలేదు. కె.సీతారాంపురం గ్రామంలో అర్హులైన 119 మంది పేదలకు తుమ్మల కుంట చెరువు భూమిలో కేటాయించారు. చెరువు భూమిని కొంత మంది పేద రైతులు సాగు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. దీంతో వారంత కోర్టును ఆశ్రయించడంతో జాప్యం అయ్యింది. బండారుగూడెంలో 78 మొదటి విడతగా అర్హులను గుర్తించారు. గ్రామానికి దూరంగా ఉన్న అంపాపురం వాగు పోరంబోకు భూమిలో కేటాయించాలని చూశారు. లబ్ధిదారులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో పట్టాలు పంపిణి నిలిచిపోయింది. ఈ నాలుగు గ్రామాల్లో 2766 మందికి పట్టాలు పంపిణీ చేసి స్థలం కేటాయించాల్సి ఉంది.

నివాస ప్రాంతంలోనే ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



డీటీ వెంకటరమణకు వినతిపత్రం అందజేస్తున్న రంగన్నగూడెం లబ్దిదారులు

హనుమాన్‌జంక్షన్, మార్చి 13 : అర్హులైన పేదలకు నివాస ప్రాంతంలోనే నివాస స్థలాలు మంజూరు చేయాలని కోరుతూ బాపులపాడు మండలం రంగన్నగూడెం గ్రామానికి చెందిన పేదలు బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదేళ్ల అవుతున్నా ఇంత వరకు మొదటి విడత గుర్తించిన అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించకపోవడం అన్యాయమని గ్రామానికి చెందిన మహిళలు అధికారుల ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో 180 మందిని అర్హులుగా గుర్తించారని వారందరికి యోగ్యమైన పట్టా భూమిని కొనుగోలు చేసి ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కొలుసు జయమ్మ, కొలుసు రజిని, రంగమ్మ మమత, సునీత, శేషగిరిరావు, శ్రీవిద్య తదితరులు పాల్గొన్నారు.

ధూమపానం ఆరోగ్యానికి హానికరం



ఉయ్యూరులో ధూమపాన వ్యతిరేక దినోత్సవ ర్యాలీ

ఉయ్యూరు, మార్చి 13 : ధూమపానం చేసేవారితో పాటు సమాజానికి కూడా చేటు చేస్తుందని ఉయ్యూరు సీఐ హబీబ్‌బాషా అన్నారు. ధూమపాన వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో విద్యార్థులతో నిర్వహించిన అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సిగరెట్, బీడీ, చుట్ట కాల్చడం వల్ల కాల్చే వారితో పాటు ఇతరుల ఆరోగ్యానికి హాని కలిగిస్తుందన్నారు. పొగతాగడం వల్ల కాన్సర్ వంటి రోగాల భారిన పడతారని క్లబ్ అధ్యక్షుడు ఎండీ ఇస్మాయిల్ అన్నారు. లయన్స్ క్లబ్ క్యాబినెట్ ట్రెజరర్ నూకల వెంకట సాంబశివరావు, జోనల్ చైర్ పర్సన్ ఎస్ రామసత్యకిషోర్, కార్యదర్శి నల్లా శ్రీనివాస్, ట్రెజరర్ వూర కిషోర్, నెల్లి రాంబాబు, దినవహి ప్రసాద్ , అబ్దుల్ హసన్, స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

ముస్లింలకు స్వీట్లు పంపిణీ



స్వీట్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

కంకిపాడు, మార్చి 13 : రంజాన్ మాసాన్ని ముస్లింలు ఎంతో పవిత్రంగా జరుపుకుంటారని తెలుగుదేశం పార్టీ జిల్లా సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ అన్నారు. కంకిపాడులోని పలు మసీదుల్లో బుధవారం కమ్మ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్‌తో కలిసి ఆయన స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక పార్టీ నాయకులు పులి శ్రీనివాస రావు, కొప్పరాజు సురేష్, చలవాది రాజా, గోగినేని వెంకటరమణ, కొండా నాగేశ్వరరావు, ఏనుగ జయప్రకాష్, వణుకూరు విక్రం, విజయ్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పెనమలూరు : మండలంలోని కానూరు, గంగూరు, పెనమలూరు, పోరంకి, తాడిగడపలలో ఉన్న మసీదుల పరిధిలోని ముస్లింలకు మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ చేతుల మీదుగా గత రెండు రోజులుగా జరుగుతున్న బహుమతుల పంపిణీ కార్యక్రమం బుధవారం కూడా జరిగింది.

సావరగూడెంలో సచివాలయం ప్రారంభం

గన్నవరం, మార్చి 13 : మండలంలోని సావరగూడెంలో రూ.87.08లక్షలతో నిర్మించిన సచివాలయం, ఆర్‌బీకే, వెల్‌నెస్ సెంటర్ భవన సముదాయాన్ని బుధవారం సర్పంచ్ అట్ల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఎంపీపీ అనగాని రవి, జడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి తదితరులు కలసి ప్రారంభించారు.

సీఏఏకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం

సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్.రఘు



గన్నవరంలో నిరసన తెలియజేస్తున్న వామపక్ష నాయకులు

గన్నవరం, మార్చి 13 : సీఏఏకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం తప్పదని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.రఘు అన్నారు. సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో సీఏఏకు వ్యతిరేకంగా పట్టణంలో ప్రదర్శన చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆర్.రఘు మాట్లాడుతూ, బీజేపీ రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తుం దన్నారు. మన దేశంలో కూడా హిందూ తాలిబన్ల రాజ్యాన్ని స్థాపించటం కోసం బీజేపీ సీఏఏను తీసుకువచ్చిందన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థగానే ప్రశ్నించే సమస్యగా ఇది మారుతుందన్నారు. దీనికి వ్యతిరేంగా పెద్ద ఎత్తున పోరాటం చేయాలని వామపక్షాలు పిలుపునిచ్చాయని తెలిపారు. ప్రజలకు సీఏఏ ప్రమాదాన్ని అర్థమయ్యే విధంగా ప్రజలకు చెప్పాల్సిన అవసరం వచ్చిందన్నారు. భారత భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని యువతీ, యువకులు ఉద్యమించాలన్నారు. వామపక్ష నాయకులు పెద్దు వాసుదేవరావు, కాట్రగడ్డ రామచంద్రజోషి, కళ్ళం వెంకటేశ్వరరావు, మల్లంపల్లి ఆంజనేయులు, అనుమోలు వెంకటేశ్వరరావు, కైలే ఏసుదాసు, మల్లంపల్లి జయమ్మ, విజయరావు, మోహనరావు, గుండెమెడ ఉదయభాస్కర్, ఖాసీం, మిరపా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

కంకిపాడు : రైతాంగ, కార్మిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 14వ తేదీన కంకిపాడులో చేపట్టనున్న నిరసన కార్యక్ర మాన్ని విజయవంతం చేయాలని రైతు సంఘం మండల కార్యదర్శి వి. శివ శంకర్ అన్నారు. స్థానిక మండేపూడి నాగభూషణరెడ్డి భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, స్వామినాథన్ కమిటీ సిఫారుసు ప్రకారం అన్ని పంటలకు మద్దతు ధరల చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే బడుగుల అభ్యున్నతి

మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తనయుడు వెంకట్రామ్



జబర్లపూడిలో బాబూ ష్యూరిటీ కార్యక్రమంలో బోడె వెంకట్రామ్, టీడీపీ నాయకులు

జబర్లపూడి(ఉయ్యూరు), మార్చి 13 : బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి తెలు గుదేశం పార్టీతోనే సాధ్యమని మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తనయుడు వెంకట్రామ్ అన్నారు. పార్టీ నాయకులతో కలసి బుధవారం జబర్లపూడి, ముదునూరు, దూసర పాలెంలో పర్యటించి బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్రామ్ మాట్లాడుతూ, టీడీపీ, జనసేన, బీజేపీల కలయికతో వైసీపీ నాయకుల గుండెల్లో రైల్లు పరిగెడుతున్నాయని, రానున్న ఎన్నికల్లో ఉమ్మడి ప్రభుత్వం ఏర్పడడం ఖాయమని తెలిసి జగన్మోహన్‌రెడ్డికి నిద్రపట్టడం లేదన్నారు. నా ఎస్సీలు, నా బీసీలు అని ఊదరగొడుతున్న జగన్మోహన్‌రెడ్డి ఆయా వర్గాలకు చేసిందేమి లేదన్నారు. పార్టీ ఉయ్యూరు మండల అధ్యక్షుడు యెనిగళ్ల కుటుంబరావు మాట్లాడుతూ, తోలిన ధాన్యానికి రెండు నెలలైనా ఇంతవరకు డబ్బు రాక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, రైతులకిచ్చేందుకు లేని డబ్బు సిద్ధం సభలకు ఎక్కడి నుంచి వస్తుందని మండిపడ్డారు. సర్పంచ్ నూరపనేని ప్రసాద్, లక్ష్మారెడ్డి, జయదేవ్, అంజిబాబు, జాన్‌బాషా, రామకోటయ్య, ఫ్రాన్సిస్ తదితరులు పాల్గొన్నారు.

పెదపులిపాకలో బోడె హేమ ప్రచారం

పెనమలూరు : మండలంలోని పెదపులిపాకలో బుధవారం జరిగిన బాబుష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో బోడె సతీమణి హేమ పాల్గొని వచ్చే ఎన్నికల్లో టీడీపీని బలపరచాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు ముసునూరి శ్రీనివాస్, నిర్మల్, గుజ్జర్లపూడి బాబూరావు, తుమ్మల రామ్‌కుమార్ పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో వ్యవస్థలు నిర్వీర్యం

హనుమాన్‌జంక్షన్: అన్ని వ్యవస్థలను నాశనం చేసిన జగన్‌రెడ్డి ప్రభుత్వానికి చరమగీతం పాడి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వానికి అధికారం ఇవ్వాలని టీడీపీ జంక్షన్ పట్టణ అధ్యక్షుడు అట్లూరి శ్రీనివాసరావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆయన ఆధ్వర్యంలో బాపులపాడు గ్రామంలోని పలు వార్డుల్లో బాబు ష్యూరిటీ -భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంపై ఇంటింటా ప్రచారం నిర్వహించారు. టీడీపీ, జనసేన ఉమ్మడి మ్యానిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం చేశారు. గన్నవరం టీడీపీ, జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావును గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్ర మం లో వడ్డిల్లిలక్ష్మి, పట్టణ కార్యదర్శి గార్లపాటి రాజేశ్వరరావు,యార్లగడ్డ సత్యనారాయణ, వీరమా చినేని బుజ్జి, గొట్టాపు వాసు, కాకుల శ్రీను, వల్లభనేని నాగమణి, సువర్ణరాజు, జనసేన వీర మహిళలు సత్యవతి, ప్రసన్న పాల్గొన్నారు.

క్యాపిటల్ ఆసుపత్రిని సందర్శించిన డీఎంహెచ్‌వో




పోరంకి క్యాపిటల్ ఆసుపత్రి సిబ్బందితో డీఎంహెచ్‌వో గీతాబాయి

పెనమలూరు, మార్చి 13 : పోరంకి క్యాపిటల్ ఆసుపత్రిని బుధవారం జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ గీతాబాయి సందర్శించారు. ఆసుపత్రిలో ఏఆర్‌టీ చట్టం ద్వారా జరుగుతున్న సహాయ పునరుత్పత్తి సాంకేతిక కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి కావాల్సిన సదుపాయాలను పరిశీలించారు. ఏఆర్‌టీ టెక్నాలజీ ద్వారా ప్రజల్లో ఉన్న వంధత్వం పరిష్కారానికి మానవ వనరులు, యంత్రసామగ్రి, సాంకేతిక పరికరాలను పరిశీలించారు. కార్యక్రమంలో తనిఖీ కమిటీ సభ్యులు డాక్టర్ శృతి, డాక్టర్ శ్రావణి, మస్తానమ్మ పాల్గొన్నారు. **ఉయ్యూరు :** జిల్లాలో లింగ నిర్ధారణ ఎంపిక నిషేధ చట్టం పటిష్టంగా అమలు చేస్తున్నట్టు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి జి గీతాబాయి అన్నారు. ఉయ్యూరులో మాక్స్ ఇమేజింగ్ స్కానింగ్ కేంద్రాన్ని బుధవారం ఆమె సందర్శించి స్కానింగ్ వివరాలు తెలుసుకున్నారు.

మొల్లమాంబ జయంతి

విజయవాడ రూరల్, మార్చి 13 : తొలి తెలుగు మహిళా కవయిత్రి మొల్లమాంబ జయంతి కార్యక్రమం నున్న పంచాయతీ కార్యాలయంలో బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కార్యదర్శి జీటీవీ రమణ ముందుగా మొల్లమాంబ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్ర మంలో సర్పంచ్ కాటూరి సరళ, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దండు సుబ్రహ్మణ్యంరాజు, తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	112, 121, 132
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.33

కవులకు మొల్ల స్ఫూర్తిదాయకం

మచిలీపట్నం టౌన్, మార్చి 13 : తెలుగునాట తొలి తెలుగు మహిళా కవయిత్రిగా పేరు పొందిన మొల్లమాంబ పలువురు కవులకు స్ఫూర్తినిచ్చారని జిల్లా కలెక్టర్ రాజాబాబు అన్నారు. కలెక్టరేట్ చాంబర్‌లో కవయిత్రి మొల్ల చిత్రపటానికి కలెక్టర్ రాజాబాబు, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ రమేష్, డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, కుమ్మరిశాలి వాహన సంఘ నాయకులు అంబటి బసవ శంకరరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సహాయ బీసీ సంక్షేమ అధికారులు వై ఇందిర, దివ్య, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



కవయిత్రి మొల్లకు కలెక్టర్ రాజాబాబు నివాళి

గుట్కా నానీని సాగనంపుతాం

గుడివాడ టీడీపీ ఇన్‌చార్జి వెనిగండ్ల రాము



శేరీవేల్పూరులో రాము, వెంకటేశ్వరరావుకు పూలమాలతో స్వాగతం

గుడివాడ రూరల్, మార్చి 13 : ఎమ్మెల్యే గుట్కా నాని కులాల మధ్య, గ్రామాల మధ్య చిచ్చులు పెట్టి కాలం గడుపుతున్నారని గుడివాడ టీడీపీ ఇన్‌చార్జి వెనిగండ్ల రాము అన్నారు. బుధవారం వెనిగండ్ల శేరీవేల్పూరు, సిద్ధాంతం, శేరీదింటకురు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాని కుతంత్రాలకు త్వరలోనే చెల్లుచీటిపెట్టి ఇంటికి సాగనంపుతున్నామని తెలిపారు. నాని గత 20 సంవత్సరాల్లో గుడివాడను పల్లెటూరులా మార్చారని ఎద్దేవా చేశారు. గుడివాడ గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామాలు అభివృద్ధి చేయటానికి ప్రణాళికలు తయారు చేశామని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గుట్కా నానికి రోజులు దగ్గర పడ్డాయని, త్వరలోనే నానిని ప్రజలు ఇంటిదోవ పట్టిస్తారని విమర్శించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బూరగడ్డ శ్రీకాంత్, టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి నాయకులు, కార్యకర్తలు, మండల టీడీపీ అధ్యక్షులు వాసే మురళీ, కానోళ్ల బుజ్జి, జుటికే సురేష్, మాదురి సుబ్బారావు, వీరవరపు వంశీ, ఇస్స శ్రీనివాసరావు, మెండం వీర్రాజు, కోటిలింగం పాల్గొన్నారు.

38వ రోజుకు చేరిన వర్ల పల్లెబాట

కూచిపూడి, మార్చి 13 : పామర్రు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వర్ల కుమార్ రాజా నియోజకవర్గంలో చేపట్టిన పల్లెబాట కార్యక్రమం 38వ రోజుకు చేరుకుంది. బుధవారం మండల పరిధిలోని చినముత్తేవి, కారకంపాడు, యద్దనపూడి, పెడసనగంటిపాలెం గ్రామాల్లో పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. టీడీపీ, జనసేన ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజా సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పార్టీ నేతలు నన్నపనేని వీరేంద్ర, వీరంకి తులసీదాసు, జనసేన నేత తాడిశెట్టి నరేష్, భోగాది నాగేశ్వరరావు, కొమ్ము అర్జునరావు, టీడీపీ, జనసేన నేతలు పాల్గొన్నారు.



చినముత్తేవిలో పర్యటిస్తున్న కుమార్ రాజా



రక్తదానం చేస్తున్న పాలిటెక్నిక్ విద్యార్థులు

మెగా రక్తదాన శిబిరం

గుడ్లవల్లేరు, మార్చి 13: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు ఆధ్వర్యంలో ఎఎఎస్ఎం అండ్ వివిఆర్ఎస్ఆర్ పాలిటెక్నిక్ వారి సహకారంతో విద్యార్థులు, అధ్యాపకులచే బుధవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా గుడివాడ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.యేసుబాబు పాల్గొని ప్రసంగించారు. 180 మంది విద్యార్థుల నుంచి రక్తాన్ని లయన్స్ ఇంటర్నేషనల్ బ్లడ్ బ్యాంక్ విజయవాడ, లయన్స్ ఆంధ్రా బ్లడ్ బ్యాంక్ విజయవాడ వారిచే సేకరించారు. కార్యక్రమంలో పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ ఎన్.రాజశేఖర్, అకడమిక్ కో-ఆర్డినేటర్ జి.వి.వి.సత్యనారాయణ, లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు బొర్రా నాగేశ్వరరావు, చలసాని శ్రీధర్, మేరుగు పెరుమాళ్లు, మాజీ లయన్స్ గవర్నర్ వైపీసీ ప్రసాద్, పోలవరపు వెంకటరావు, పొట్లూరి రవి కుమార్, జంగం మోహనరావు, సూరపనేని పరంధామయ్య తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో గౌతమ్ విద్యార్థుల ప్రతిభ

గుడివాడ : ఇటీవల చెన్నైలో జరిగిన 2వ అంతర్జాతీయ మావాటో-కషిటోర్యూ ఆన్‌లైన్ ఎపెన్ కరాటే పోటీల్లో స్థానిక డా.కెకెఆర్స్ గౌతమ్ పాఠశాలకు చెందిన కె.వేదశ్రీ నాగేంద్రకుమార్, వై.కీర్తి వర్షిణిసాయి,సి.హెచ్ భవఘ్న ప్రతిభ చాటారని పాఠశాల ప్రిన్సిపాల్ పి.లక్ష్మీప్రసాద్ తెలిపారు. బుధవారం స్థానిక పాఠశాలలో జరిగిన అభినందన సభలో పతకాలు సాధించిన విద్యార్థులను, కోచ్ ఎన్.వెంకటేశ్వరరావులను పాఠశాల ప్రిన్సిపాల్స్ సత్యారామ్, జ్యోతి, జబ్రీనా, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

గోగినేనిపాలెంలో సాఫ్ట్‌బాల్ సెలక్షన్స్



గెలుపొందిన గోగినేనిపాలెం జడ్పీ పాఠశాల టీమ్

ఘంటసాల, మార్చి 13 : ఉమ్మడి కృష్ణా జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సెలక్షన్ ట్రైల్స్‌లో భాగంగా గోగినేనిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8 సాఫ్ట్ బాల్ క్లబ్ టోర్నమెంట్లు నిర్వహించారు. ఇందులో మొదటి స్థానం గోగినేనిపాలెం జిల్లా పరిషత్ పాఠశాల టీమ్ కైవసం చేసుకోగా, రెండో స్థానం పల్లెర్లమూడి టీమ్, మూడో స్థానం ఉయ్యూరులోని ఫ్లోరా ఇంగ్లీష్ మీడియం టీమ్ గెలుపొందాయి. ఉత్తమ ప్రతిభ కనబర్చిన గోగినేనిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల టీమ్ క్రీడాకారులను కృష్ణా జిల్లా టీమ్ తరఫున రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. వీరు అనంతపురంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో కృష్ణా జిల్లా తరఫున ఆడతారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు తమ్మన వేణుగోపాలరావు తెలిపారు.

జాతీయస్థాయి పోటీలకు ఇద్దరు విద్యార్థినులు

మచిలీపట్నం టౌన్, మార్చి 13 : రోస్టర్‌స్థాయి ఇన్‌స్పెయిర్ సైన్సు మొనక్ పోటీలలో కృష్ణాజిల్లాకు చెందిన ఇద్దరు విద్యార్థులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని డీఈవో తహెరాసుల్తానా తెలిపారు. చిత్తూరు జిల్లా పలమనేరులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో గూడూరు మండలం తరకటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని కోట నిహారిక ఎంపికైంది. కాగా బందరు మండలం గుండుపాలెం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని ఎం దుర్గాసాయి ఎంపికైంది. ఈ సందర్భంగా విద్యార్థులను జిల్లా సైన్సు ఆఫీసర్ మహమ్మద్ జాకీర్ అహ్మద్ అభినందించారు.

ఎమ్మెల్యే సింహాద్రి ఎన్నికల ప్రచారం

అవనిగడ్డ రూరల్, మార్చి 13 : అవనిగడ్డ నియోజకవర్గంలోని దక్షిణ చిరువోలులంకలో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు బుధవారం ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. స్థానికంగా ఉన్న ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామస్థులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైసీపీ నాయకులు కడవకొల్లు నరసింహారావు, సింహాద్రి వికాస్, జడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, సర్పంచ్ సనకా సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఇనుము, సిమెంటు వితరణ

చల్లపల్లి, మార్చి 13 : స్థానిక సీయోను అనాథ వృద్ధాశ్రమ నిర్మాణానికి చల్లపల్లిలోని మదర్ థెరెస్సా ఇంగ్లీష్ మీడియం సంస్థ యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు టన్ను ఇనుము, 100 బస్తాల సిమెంటు వితరణగా అందచేశారు. బుధవారం ఆశ్రమ ప్రాంగణానికి వచ్చిన కరస్పాండెంట్ ఆంధ్రూ గోమ్స్, ప్రిన్సిపాల్ ప్రశాంతిలు చెక్కును ఆశ్రమ నిర్వాహకులు శీలం భాస్కరరావుకు అందజేశారు.

కొత్త ఓటరు నమోదుకు సహకరించాలి

సహాయ ఎన్నికల అధికారిణి శ్రీపల్లవి



మాట్లాడుతున్న అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిణి

పామర్రు, మార్చి 13: నూతన ఓటరు జాబితా ప్రత్యేక సవరణ -2024 కార్యక్రమంలో భాగంగా చివరిదశలో ఉన్న కొత్త ఓటరు నమోదుకు అన్ని రాజకీయ పార్టీల నేతలు సహకరించాలని పామర్రు నియోజకవర్గ అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి.శ్రీపల్లవి కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఓటర్ల జాబితా తయారు మార్పులపై అఖిలపక్ష నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఓటరు సవరణ, నమోదు ప్రక్రియపై పౌరులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గొట్టిపాటి లక్ష్మీదాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తాడిశెట్టి సాంబశివరావు, చిన్నారెడ్డి, ఈడేగంటయ్య సీపీఎం నుంచి గంగాధరరావు, సుబ్బారావు, ఎన్నికల డీటీ పిజగన్మోహనరావు, పెదపారుపూడి, పమిడిముక్కల తహసీల్దార్లు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగులకు నేత్ర పరీక్షలు

మచిలీపట్నం టౌన్, మార్చి 13 : రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం సంఘ కార్యాలయంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. రాజమండ్రి గౌతమి నేత్రాలయం వైద్యులు, సిబ్బంది కంటి పరీక్షలు నిర్వహించారు. ఇద్దరికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడురాజేంద్రప్రసాద్, ఉపాధ్యక్షుడు రాఘవ రావు, కోశాధికారి శంకరరావు, వెంకటేశ్వరరావు, దుర్గారావు, సత్యనారాయణ, మునలయ్య, సయ్యద్ పీర్, కమలేశ్వర్ పాల్గొన్నారు.

పెడన పోలీస్ స్టేషన్ పరిశీలన

పెడన, మార్చి 13 : ఎన్నికల విధుల్లో భాగంగా పెడన అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి. వెంకటరమణ బుధవారం పెడన పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. పోలీస్ స్టేషన్‌లో ఉన్న పోస్టల్ బ్యాలెట్ పేపర్లను భద్రపరచనున్న గదిని ఆయన పరిశీలించారు. పోస్టల్ బ్యాలెట్ పేపర్లు వచ్చాక వాటి భద్రతపై ఎటువంటి చర్యలు తీసుకోవాలన్న విషయమై ఆయన అక్కడి సిబ్బందితో చర్చలు జరిపారు.

హడావిడిగా ప్రారంభోత్సవాలు

పామర్రు, మార్చి 13: ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు, ప్రారంభోత్సవాలు చేయడానికి అవకాశం ఉండదనే ఆలోచనతో అధికార పార్టీలోని ప్రస్తుత ఎమ్మెల్యేలు నిమగ్నమయ్యారు. నియోజకవర్గంలో వివిధ గ్రామాల్లో గడిచిన ఐదేళ్ల కాలంలో చేపట్టిన అభివృద్ధి పనులను పూర్తిచేసిన వాటికి హడావిడిగా ప్రారంభోత్సవాలు, శిలాఫలకాలు, కొత్తపనులకు శంకుస్థాపనలకు పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా మండల పరిధిలోని పామర్రు కోమరవోలు, జమీగోల్వేపల్లి, కురుమద్దాలి, ఎలకుర్రు గ్రామాల్లో నూతన సీసీ రోడ్లను బుధవారం స్థానిక ప్రజాప్రతినిధులతో కలసి ప్రారంభోత్సవం చేశారు. సర్పంచ్ కస్తూరి, ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, జడ్పీటీసీ సభ్యురాలు కూనపరెడ్డి స్వరూపరాణి పాల్గొన్నారు. గత వారం రోజులనుంచి మొవ్వ, పెదపారుపూడి, పమిడిముక్కల, తోట్లవల్లూరు మండలాల్లో పెండిగ్‌లో ఉన్న అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలను ఆ పార్టీ ప్రజాప్రతినిధులతో నిర్వహిస్తున్నారు.

మచిలీపట్నం టౌన్ : మచిలీపట్నం నగరంలో రాజుపేటలో రోడ్ల నిర్మాణ పనులకు బుధవారం మేయర్ చిటికెన వెంకటేశ్వరమ్మ శంకుస్థాపనచేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ తాతారావు తదితరులు పాల్గొన్నారు.

పెదతుమ్మిడిలో టీడీపీ ప్రచారం



పెదతుమ్మిడిలో ప్రచారం నిర్వహిస్తున్న కాగిత శిరీష

బంటుమిల్లి, మార్చి 13: మండలంలోని పెదతుమ్మిడిలో పార్టీ మండల కన్వీనర్ కూనపరెడ్డి వీరబాబు ఆధ్వర్యంలో జరిగిన బాబూ ష్యూరిటీ- భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్ సతీమణి శిరీష ఇంటింటికి తిరిగి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కృష్ణప్రసాద్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సంపటాలమ్మ వార్షికోత్సవాలు



అన్నదానంలో మండలి వెంకట్రామ్

చల్లపల్లి, మార్చి 13 : చల్లపల్లి గ్రామదేవత సంపటాలమ్మ అమ్మవారి ఆలయ 25వ వార్షిక మహోత్సవాలు వైభవంగా ముగిశాయి. మూడు రోజుల పాటు జరిగిన ఉత్సవాలు బుధవారంతో ముగియగా, ఆలయ పూజారి చల్లపల్లి కోటేశ్వరరావు దంపతులు అమ్మవారికి విశేష అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి వెంకట్రామ్ అమ్మవారిని దర్శించుకుని పూజలుచేసి అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండల టీడీపీ అధ్యక్షుడు మోర్ల రాంబాబు, సర్పంచ్ కృష్ణకుమారి, ఎంపీపీ కోట విజయ రాధిక, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

పోలీసుల కవాతు

కూచిపూడి, మార్చి 13 : సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని కేంద్ర బలగాలు, స్థానిక పోలీసులు సంయుక్తంగా మొవ్వ మండలంలోని పలు గ్రామాల్లో కవాతు నిర్వహించారు. మొవ్వ, కూచిపూడి, అయ్యంకి తదితర గ్రామాల్లో కవాతు నిర్వహించి ఓటర్లు ప్రశాంత వాతావరణంలో నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలంటూ వారిలో మనోధైర్యాన్ని నింపారు. కేంద్ర బలగాలతోపాటు ఎస్ఐ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన ఫలితాలు సాధించాలి



పరీక్షా సామాగ్రి కిట్లు అందిస్తున్న సీఐ

మోపిదేవి, మార్చి 13 : త్వరలో జరుగనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో మెరుగైన ఫలితాలు సాధించే దిశగా ప్రతీ ఒక్కరూ ప్రణాళికలు రూపొందించుకోవాలని చల్లపల్లి సీఐ సిహెచ్.నాగ ప్రసాద్ తెలిపారు. బుధ వారం ఉదయం మండలంలోని పెదప్రోలు జడ్పీ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు గ్రామానికి చెందిన రెబ్బా వెంకటేశ్వ రరావు జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు ఉమామహేశ్వరరావు, వినోద్, తిరుపతమ్మలు పరీక్షా సామాగ్రి కిట్లను అందజేశారు. సీఐ ముఖ్య అతిథిగా పాల్గొని పదవ తరగతి విద్యార్థులకు ప్యాడ్, జామెంట్రీ బాక్సు, పెన్నులు అందజేశారు.

చదువులతల్లికి ప్రత్యేక పూజలు

కూచిపూడి: చదువుల తల్లి సరస్వతీదేవికి కూచిపూడి జడ్పీ పాఠశాల పదవ తరగతి విద్యార్థులు బుధవారం పాఠశాల ఆవరణలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెన్నులు, ప్యాడ్లు అమ్మవారి వద్ద ఉంచి ప్రార్థనలు నిర్వహించారు. హెచ్ఎం సాయికుమార్ విద్యార్థులకు హాల్ టిక్కెట్లు పంపిణీ చేశారు.

మూడు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు

అవనిగడ్డ రూరల్: పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు మూడు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎంఈవో ఎన్.శివశంకర్‌రావు తెలిపారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల, చైతన్య టెక్నో పాఠశాల, ఎన్ఆర్ఐ వికాస్ పాఠశాలలు కేంద్రాలుగా ఉన్నాయని, మండలంలో 342 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు ఎంఈవో తెలిపారు. 9.30కు పరీక్ష ప్రారంభమవుతుందని, అరగంట ముందు పరీక్షా కేంద్రానికి రావాలని తెలిపారు.

కాంగ్రెస్ గుడివాడ అభ్యర్థిగా వడ్డాది దరఖాస్తు

గుడివాడ : గుడివాడ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వడ్డాది గోవిందరావు బుధవారం విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో దరఖాస్తు సమర్పించారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకుల అనుమతితో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలని కోరారు.

నేటి నిరసనను విజయవంతం చేయండి

గుడివాడ : రైతు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చలో ఢిల్లీ కార్యక్రమ నేపథ్యంలో గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద జరుగు నిరసన కార్యక్రమంలో రైతులు, కార్మికులు పాల్గొని మద్దతు తెలపాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌సీపీ రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పంటల మద్దతు ధరల గ్యారెంటీ చట్టం, రైతు రుణమాఫీ చట్టం తేవాలని, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్‌కోడ్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకులు పోతురాజు, వి.నాగబాబు, సీఐటీయూ నాయకులు ఆర్.కొండ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీ అంబటి బ్రాహ్మణయ్యకు నివాళి



కోడూరు, మార్చి 13 : మాజీ పార్లమెంట్ సభ్యులు అంబటి బ్రాహ్మణయ్య కాంస్య విగ్రహానికి టీడీపీ, జనసేన నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను నేతలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు మర్రే గంగయ్య, లంకే యుగంధర్, మాచర్ల భీమయ్య, బడే వీరబాబు, కాగిత రామారావు, పరిశె నాగమల్లేశ్వరరావు, సర్పంచ్ కనగాల వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు లంకే భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని ఒకరి మృతి



సంఘటనా ప్రదేశంలో వాహనాలు

చల్లపల్లి, మార్చి 13 : చల్లపల్లి మండలం లక్ష్మీపురంలో బుధవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో మచిలీపట్నంకు చెందిన నాగశ్రీను (42) మృతి చెందాడు. లక్ష్మీపురం కేసీపీ సమీపంలో ఈ ఘోర ప్రమాదం జరిగింది. వివరాల ప్రకారం, మచిలీపట్నం నవీన్‌మిట్టల్ కాలనీకి చెందిన ఎన్.నాగశ్రీను అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై చల్లపల్లి నుంచి బందరు వైపు వెళుతుండగా, బందరు నుంచి వస్తున్న కారు ఢీకొనటంతో ప్రమాదం జరిగింది. తీవ్రంగా గాయపడిన నాగశ్రీనును ఘంటసాల 108 అంబులెన్స్ సిబ్బంది అత్యవసర చికిత్సలు అందిస్తూ మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు విజయవాడ రిఫర్ చేశారు. కుటుంబ సభ్యులు విజయవాడ తరలించే ప్రయత్నంలోనే నాగశ్రీను మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు తెలుస్తోంది. మృతుడు డెకరేషన్ పనులు చేస్తూ జీవిస్తుంటాడని చెబుతున్నారు.

అధ్యాపకుల పల్లెబాట

అవనిగడ్డ, మార్చి 13 : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు డిగ్రీ ప్రవేశాల కోసం పల్లెబాట పట్టారు. కళాశాల ప్రిన్సిపాల్ డి.ఉమారాణి ఆదేశాల మేరకు అధ్యాపకులు, సిబ్బంది ఇంటర్మీడియట్ పూర్తి చేసుకున్న విద్యార్థుల ఇళ్లకు వెళ్లి డిగ్రీ కళాశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను, గ్రామస్థులను కోరారు. నాగాయలంక మండలం తలగడదీవి, కొత్తపాలెం, గణపేశ్వరం, దిండి, సొర్లగొంది, ఇతర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు.

అత్యవసరంగా కౌన్సిల్ సమావేశం

పెడన, మార్చి 13 : పెడన మునిసిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం బుధవారం జరి గింది. చైర్‌పర్సన్ కటకం నాగకుమారి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అజెండాలోని ఐదు అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. వార్డు సభ్యుడిగా, కౌన్సిలర్ గాను వ్యవహరించిన దివంగత నాయకుడు గరిక ముక్కు పెద నాంచారయ్య చిత్రపటాన్ని కౌన్సిల్ హాల్‌లో ఏర్పాటు చేయాలని సమావేశం తీర్మానించింది. నూతన కమిషనర్‌గా వచ్చిన వెంకట్రామయ్యను చైర్‌పర్సన్ నాగ కుమారి కౌన్సిల్ సభ్యులకు పరిచయం చేశారు. టీపీవో ఏసుబాబు, ఆర్ఐ పామర్తి వెంకటేశ్వరరావు, ఏఈ రామాంజనేయులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ హరికిషోర్, సీనియర్ అసిస్టెంట్ సుందరం, తదతదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

ధాన్యం బకాయిలు వెంటనే చెల్లించాలి

చల్లపల్లి, మార్చి 13 : రైతులకు రావలసిన ధాన్యం బకాయిలను వెంటనే చెల్లించాలని సీపీఎం నేతలు యద్దనపూడి మధు, వాకా రామచంద్రరావు, మహమ్మద్ కరీముల్లాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక గుంటూరు బాపనయ్య భవన్‌లో వారు విలేకర్లతో మాట్లాడుతూ, రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి 21 రోజులలోపు డబ్బులు జమ చేస్తామని ప్రభుత్వం చెప్పిన మాటలు బూటకమని విమర్శించారు. ప్రస్తుతం మినుముతీత, పంట నూర్పిడికి అవసరమైన కూలీ ఖర్చులు చెల్లించేందుకు, యంత్రాలకు అద్దె చెల్లించేందుకు డబ్బులు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు.

వైభవంగా దుర్గానాగేశ్వరుని పవళింపు సేవ



పవళింపు సేవలో అర్చకులు

మోపిదేవి, మార్చి 13 : మండలంలోని పెదకళ్లేపల్లిలో ఉన్న శ్రీ దుర్గానాగేశ్వర స్వామి వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి స్వామివారి పవళింపు సేవా కార్యక్రమం వైభ వంగా జరిగింది. ఆలయ ఈవో ఎన్.ఎస్. చక్రధరరావు, సహాయక ఉద్యోగులు వెంకట రమణ ఆధ్వర్యంలో అర్చక బృందం ప్రత్యేక పూజలు జరిపారు.

విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో విజిలెన్స్ దాడులు

మచిలీపట్నం టౌన్, మార్చి 13 : మచిలీపట్నం నగర పరిధిలో విద్యుత్‌శాఖ విజిలెన్స్ అధికారులు బుధవారం ఆకస్మిక దాడులు జరిపారు. విజిలెన్స్ జీఎం ఎం అల్ఫాన్స్, కె వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో 38 బృందాలుగా ఏర్పడి తనిఖీలు నిర్వహించారు. 598 గృహ సర్వీసులు, 1853 వాణిజ్య సముదాయాలు తనిఖీలు చేశారు. 75 సర్వీసులకు అదనపు లోడు ఉన్నట్టు గుర్తించారు. మూడు లక్షలు జరిమానా విధించారు. ఈ తనిఖీలలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం భాస్కరరావు, డీఈఈ కె రామకృష్ణ, ఎఈ రమణ, తదితరులు పాల్గొన్నారు.

20 లీటర్ల సారా స్వాధీనం

పెడన, మార్చి 13 : పట్టణంలోని దక్షిణ తెలుగుపాలెంలో నాటు సారా స్థావరాలపై సెబ్ అధికారులు, సిబ్బంది బుధవారం ఉదయం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడులలో నాటుసారా తయారు చేస్తున్న పెరుమాళ్ల రవి నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఏపీ ప్రొహిబిషన్ యాక్ట్ కింద వీరిపై కేసులు నమోదు చేశారు. సెబ్ ఎస్పీ జి వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు జరిగిన ఈ దాడుల్లో ఆ శాఖ ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

రహదారి పనులు ప్రారంభం

చల్లపల్లి, మార్చి 13 : చల్లపల్లి గ్రామ పంచాయతీ సాధారణ నిధులు రూ.5.25లక్షలతో రెండు రహదారుల నిర్మాణ పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. స్థానిక నారాయణరావునగర్ కాలనీలో జీఎస్‌బీ రహదారులను నిర్మించనుండగా, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఎంపీపీ కోట విజయ రాధిక, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, ఏడు కొండలు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు.